క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కోనా వేంకటేశ్వర స్వామి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రియమైన రోజుతో పాటు, చివరి శ్రావణ శనివారం కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వరస్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు.

నేడు సింహ ద్వార ప్రారంభోత్సవం

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ సింహ ద్వారమును ఆదివారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. సింహ ద్వార ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సినీ హీరో సుమన్, దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరు తవసు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై తెల్లవారు జామున 3.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది శనివారం తెలిపారు. వివరాల మేరకు మహారాష్ట్రకు చెందిన లారీ ఉల్లిపాయల లోడ్‌తో నంద్యాల వైపు వస్తుండగా సుగాలిమెట్ట వద్ద నెమ్మదిగా మిట్ట ఎక్కుతుండగా వెనుక నుంచి తమిళనాడుకు చెందిన బొలెరో క్యాంపర్ ఢీకొంది. ఈ ఘటనలో బొలెరో క్యాంపర్ డ్రైవర్ తవసు స్టేరింగ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వాహనదారులు నంద్యాల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టైల్స్ షోరూమ్ ప్రారంభం

కల్లూరు: నగరంలోని కేంద్రియ విద్యాలయం స్కూల్ సమీపంలో ఎస్ఎస్ టైల్స్ షో రూమ్‌ను శనివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు సరసమైన ధరలకు వివిధ రకాల కంపెనీలకు చెందిన టైల్స్‌ను షాపు యాజమానులు అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో బాలాజీ గౌడ్, మహమ్మద్ ఫారుక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో సామూహిక ఒడిబియ్యం



వడిబియ్యం కార్యక్రమంలో మహిళలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఉన్న ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆర్యవైశ్య అన్నసత్రం నిర్మించి 18సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 200 మంది సంతానం లేని మహిళలకు వడిబియ్యం వేసినట్లు శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆర్యవైశ్య అన్నసత్ర సంఘం అధ్యక్షుడు నెరవాడ సత్యానారాయణ తెలిపారు. ఉదయం ఉంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఎమ్మెల్యే ముఖాముఖి'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఈ నెల 10వ తేదీన ఆదివారం మహిళలతో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎం మల్లికార్జునస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చించనున్నట్లు వెల్లడించారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం జి. సింగవరంలో ఈ నెల 10వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జదరొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు.

అవినీతికి పాల్పడితే శిక్ష అనుభవించక తప్పదు

- ఆధారాలతోనే టీడీపీ నేత చంద్రబాబు అరెస్టు
- సానుభూతి కోసమే టీడీపీ ధర్నాలు, నిరసనలు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): అవినీతికి పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శిక్ష అనుభవించక తప్పదని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం సాయంత్రం స్టాంటన్ పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవినీతిపరుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేస్తే టీడీపీ నాయకులు రాజకీయంగా సానుభూతి పొందాలనే ఉద్దేశంతోనే అక్కడక్కడా ధర్నాలు, నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడినేది వాస్తవం కాదా సమాధానం చెప్పాలన్నారు. తమ కంపెనీకి సంబంధం లేదని సిమెన్స్ అధికారులు కోర్టులో వాంగ్మూలం ఇవ్వడం నిజం కాదా అన్ని ప్రశ్నించారు. బోగస్ ఎంఓయూలో చేసుకుని రూ.371 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల చేసి ఆ డబ్బులు చంద్రబాబు నాయుడుకు చేరాయని సీఐడీ అధికారుల విచారణలో తేల్చి ఆధారాలతో అరెస్ట్ చేశారన్నారు. ప్రభుత్వం వాటా 10 శాతం, సిమెన్స్ కంపెనీ వాటా 90 శాతం అని ఎంఓయూ రాసుకున్నారని, సిమెన్స్ కంపెనీ వారు ఎంఓయూ జరగలేదని క్లియర్‌కట్‌గా అధికారులు చెప్పారన్నారు. ప్రభుత్వం నుంచి 10శాతం మాత్రం డబ్బులు రిలీజ్ చేసుకుని క్యాబినెట్‌లో ఆమోదం పొంది, విదేశాలకు పంపించి చంద్రబాబు జేబులోకి వచ్చాయని సీఐడీ అధికారులు విచారణలో తేల్చారని చెప్పారు. స్కాం బయటపడడంతో వెంటనే లాయర్లను పిలిపించుకోవడం, అధికారులను నిలదీయడం చూస్తుంటే సినిమాటిక్‌గా సానుభూతి పొందాలనే ఉద్దేశంతోనే చంద్రబాబు నాటకమాడారని విమర్శించారు. సమావేశంలో జెడ్పీటీసీ గిరిజోన్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మద్దిలేటి, భాస్కర్, సుంకన్న, సురేష్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మాజీ సర్పంచ్ ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆందోళన అంతంతమాత్రమే

కోడుమూరు: స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట చేసిన కుంభకోణంలో పక్కా ఆధారాలతో సీఐడీ అధికారులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు అంతంతమాత్రంగానే కొనసాగాయి. టీడీపీ అధినేతే అవినీతి కుంభకోణంలో ఇరుక్కుపోవడంతో ఆ పార్టీ నేతలు ఆందోళన చేసేందుకు ముఖం చాటేశారు. ప్రజలు కూడా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. టీడీపీ నేతలు ఆందోళన చేపడతారనే ఆలోచన కూడా లేకుండా ప్రజలు వివిధ వ్యాపారాలను యథావిధిగా కొనసాగించారు. కోడుమూరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆకెపోగు ప్రభాకర్ 10మంది కార్యకర్తలతో ఆందోళన చేపట్టగా, పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆందోళన కార్యక్రమాన్ని మమా అనిపించారు. గూడూరు, సి.బెళగల్ మండలాల్లోను ఆందోళన కార్యక్రమాలను కోట్ల, విష్ణు వర్గపోరుతో ఎవరికి వారే ప్రత్యేకంగా ఆందోళన చేపట్టారు. చంద్రబాబు అరెస్ట్‌తో జనజీవనం స్తంభించిపోయి పెద్ద ఎత్తున టీడీపీకి సానుభూతి పొందాలనుకున్న నేతల ప్రయత్నాలు ఫలించలేదు.

అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు



స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చేసిన కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డంగా దొరికిపోయాడు. ఇందుకు సంబంధించి సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో అరెస్ట్ చేశారు. చంద్రబాబు క్యారెక్టర్ ఏమిటో ప్రజలందరికీ తెలుసు, అధికారం కోసం సొంతమామకే వెన్నుపోటు పొడిచిన ఘనుడు. ఇన్నాళ్లకు బాబు అవినీతి బండారాన్ని సీఐడీ అధికారులు బట్టబయలు చేశారు.

– కృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు, కోడుమూరు

చేసిన పాపాల ఫలితమే



గతంలో చేసిన పాపాల ఫలితామే నేడు చంద్రబాబు అరెస్టు. స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో రూ.371 కోట్లను స్కాం చేశాడు. ఇది మొదలు మాత్రమే. గతంలో ఆయన చేసిన స్కామ్‌లన్నింటినీ బయటికి తీసి విచారించాలి. ఇంకా ఎన్ని స్కామ్‌లు ఉన్నాయో?. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం విషయంలో ఆయనను అరెస్టు చేశారే తప్ప రాజకీయంగా కాదు.

– శ్రీధర్‌రెడ్డి, పెద్దపాడు మాజీ సర్పంచ్

రాష్ట్రానికి శుభపరిణామం



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయడం శుభపరిణామం. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి ఏమి తెలియనట్టుగా నటిస్తున్న వ్యక్తి చంద్రబాబు. గతంలో ఆయనపై చేసిన ఆరోపణలపై కోర్టులో స్టే తెచ్చుకుని తప్పించుకున్నారు. ఆయన అరెస్ట్‌తో ఏపీతో పాటు తెలంగాణ ప్రజలు ఆనందంలో ఉన్నారు. ఓటు నోటు కేసులో తప్పు చేసి తప్పించుకున్నాడు.

– ఎ.హనుమంతురెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్.

అవినీతిపై విచారణ జరపాలి



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతిపై సీఐడీ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. స్కిల్ కుంభకోణంలో వందలాది కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని చంద్రబబాబు దుర్వినియోగం చేశారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నాయని, 28కి పైగా కేసులు నమోదు అయినా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ కోర్టుల్లో స్టేలు తెచ్చుకున్న ఏకైక వ్యక్తి చంద్రబాబే. స్కిల్ స్కాంతో పాటు అమరావతి భూ కుంభకోణం, తాత్కాలిక సచివాలయం, కోర్టుల పేరిట జరిన దోపిడీపై కూడా పోలీసులు విచారణ జరిపి శిక్షించాలలి.

–పీఎస్ అస్లాం, వైస్ చైర్మన్, గూడూరు

సానుభూతి పొందాలనే ఉద్దేశంతోనే..



టీడీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ప్రజల సానుభూతి పొందాలనే ఉద్దేశంతోనే రాజకీయ డ్రామాలు ప్రదర్శిస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా తనకున్న పలుకుబడితో బెయిల్ తెచ్చుకొని ఏ ఒక్క నోటీసుకు స్పందించకుండా కోర్టును ధిక్కరించారు. ప్రస్తుతం ఆయన అవినీతి బయటపడటంతో చట్టం తనపని తాను చేసింది. ఇందులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రమేయం ఏమాత్రం లేదు.

– లోటర్‌బాషా, జేసీఎస్ మండల కన్వీనర్, ఓర్వకల్లు మండలం.

తప్పు చేసినట్లు దర్యాప్తు సంస్థలు తేల్చాయి



చంద్రబాబు తప్పు చేసినట్లు దర్యాప్తు సంస్థలు తేల్చాయి. ఇక ఆయన శిక్ష తప్పదు. ఆయన మోసపూరిత విధానాలు, ఆయన కుట్రలతో కూడిన ఆయన క్యారెక్టర్ రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసు. ప్రజలు చంద్రబాబును నమ్మే స్థితిలో లేరు. బాబు తన స్వార్థం కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలతో కోట్ల రూపాయల స్కామ్‌కు పాల్పడ్డారనేది జనానికి తెలుసు.

– నాగేశ్వరరెడ్డి, ఈర్లదిన్నె, సి.బెళగల్ మండలం

చట్టం దృష్టిలో అందరూ సమానులే



రాజ్యాంగం ముందు అందరు సమానమే, అందరూ చట్టానికి లోబడే జీవించాల్సి ఉంటుంది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన కుంభకోణం వల్లే సీఐడీ పోలీసులు చంద్రబాబును అరెస్టు చేశారు. సీఐడీ అధికారులపై బెదిరింపు ధోరణితో మాట్లాడడం తగదు. ఆయన వెంట ఉన్న పచ్చ మీడియా రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని, ఏదో జరుగుతుంది ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు యత్నిస్తోందన్నారు.

– సద్దల సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, పాణ్యం

చంద్రబాబు యువతను దగా చేశాడు



విద్యార్థుల నైపుణ్యాలను అభివద్ధి చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి చంద్రబాబు యువతను దగా చేశాడు. ఆయన పాపం పండి అరెస్టు చేశారు. సీమెన్స్ ఒప్పందం అని చెప్పి, అనేక షెల్ కంపెనీల పేర్లతో డబ్బును మళ్లించారు. సత్యహరిశ్చంద్రుని తర్వాత నేనే అని చెప్పుకునే చంద్రబాబు భారీ స్కాంలకు పాల్పడ్డారు. అవినీతికి పాల్పడితే రోడ్డుపై ఉరి తీయమన్న చంద్రబాబు.. ఇప్పుడు ఏం మాట్లాడతారు?.

– ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు

మర్యాదపూర్వక కలయిక



లోకాయుక్త చైర్మన్ పి.లక్ష్మణ్‌రెడ్డితో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్) : లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డిని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కర్నూలు వచ్చిన వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి లోకాయుక్త చైర్మన్‌ను ఆయన నివాసంలో కలిసి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలపై చర్చించారు. లోకాయుక్త బాధ్యతలు తీసుకున్న తరువాత కర్నూలులోనే చైర్మన్ నివాసం ఉండి కక్షిదారులకు అందుబాటులో ఉండడం అభినందనీయమని వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి కితాబు ఇచ్చారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు



ఆర్‌యూలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఆర్‌యూలోని లైఫ్ సైన్సెస్, అకడమిక్ భవనాల్లో పీజీ పరీక్ష కేంద్రాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

15మంది గైర్హాజరు :

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పీజీ నాలుగోసెమిస్టర్ పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు చెప్పారు. 536 మందికి గాను 521 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయన పేర్కొన్నారు.

మహిళలకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

కర్నూలు(అర్బన్): నగరంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలకు ఉపాధి సంబంధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రాజ్‌కుమార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు బి. రత్నకుమారి తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 18 నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న మహిళలకు కుట్టు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాని చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళలు సెల్: 7569325354 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్/టౌన్) : ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాయలసీమ జోన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఐ.విజయ్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఎథిక్స్ కమిటీ సభ్యులు మురళి చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాలు అందజేశారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయం ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. బిల్డింగ్ నిర్మాణాలకు సంబంధించి ఫీజు బకాయిలు ఉన్న భవన యజమానులకు ఇప్పటికే నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. కోర్టు ద్వారా నోటీసులు అందుకున్న యజమానులు లోక్ అదాలత్‌కు హాజరై ఫీజు బకాయిలు చెల్లించారు. లోక్ అదాలత్ ద్వారా రూ.25 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

14న నెల్లూరులో కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్

కర్నూలు(సెంట్రల్): నెల్లూరు నగరంలో ఈనెల 14న కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా సమావేశాలు నిర్వహించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు తెలిపారు. శనివారం శరీన్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈ సమావేశాలు 14 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మొదటిరోజున కార్మికుల ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సమావేశాలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత

కర్నూలు(అగ్రికల్చర్): గుండెపోటుతో మరణించిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త అనిల్ (35) కుటుంబ సభ్యులను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి పరామర్శించారు. శనివారం 19వ వార్డులోని అనిల్ నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం కూడా అందజేశారు.

మేఘనాథరెడ్డికి మహేశ్వరయ్య స్మారక పురస్కారం



మేఘనాథరెడ్డికి మహేశ్వరయ్య స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: చిత్తూరు జిల్లాకు చెందిన రచయిత కె.వి.మేఘనాథరెడ్డికి మహేశ్వరయ్య స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆయన రాసిన కథల సంపుటి కలుంకూరి గుట్ట కథలకు ఈ పురస్కారం వరించింది. సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన అవార్డు ప్రదానం కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త హెచ్‌ఆర్‌కే మాట్లాడుతూ గ్రామీణ జీవన సౌందర్యం, భాష సంస్కృతులకు అద్ద పట్టడమే కాకుండా పల్లె బతుకుల ముఖ చిత్రంగా కలుంకూరి గుట్ట కథలున్నాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు మాట్లాడుతూ మేఘనాథరెడ్డి రాసిన కథలన్నీ వాస్తవ జీవితానికి ప్రతిబింబాలన్నారు. అవార్డు కమిటీ అధ్యక్షుడు కెంగారమోహన్, అనంతపురం జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, కవులు, రచయితులు జి.వెంకటకృష్ణ, మారుతి, వెంకటలక్ష్మమ్మ, నాగేశ్వరాచారి, చౌశా, ఇనాయతుల్లా, ఏవీ రెడ్డి, సయ్యద్ జహీర్ అహ్మద్, సుల్తాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సమావేశం

కర్నూలు కల్చరల్: శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి, స్థానిక ఉత్సవ కమిటీల ప్రతినిధుల సమావేశం ఆదివారం సాయంత్రం 6 గంటలకు వినాయక్ ఘాట్‌లోని సమావేశ మందిరంలో జరుగనుంది. ఈ విషయాన్ని ఉత్సవ సమితి సహ ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీల ప్రతినిధులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ కోత

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతులను పురస్కరించుకొని ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కర్నూలు ఈఈ రమేష్, డీఈఈ రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఉస్మానియా కళాశాల ఫీడర్ పరిధిలోని బాపూజీ నగర్, ఉస్మానియా కళాశాల, కేఎమ్ హాస్పిటల్, మాసుంబాషా దర్గా, తెలుగు గేరి ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 9 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'ఉపనిషత్తుల పరమార్థం'పై సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: ఆచార్య మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య 113వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహిస్తున్నట్లు సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య మసన చన్నప్ప ముఖ్య వక్తగా హాజరై 'ఉపనిషత్తుల పరమార్థం'అనే అంశంపై ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కల్లూరులోని ఆదిత్య విద్యాలయంలో సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు ఆర్థో, న్యూరో ఆక్యూప్రెజర్ నిపుణులు శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

నగర పాలక పెట్రోల్ బంకు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నగరపాలక పెట్రోల్ బంకును ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కమిషనర్ భార్గవ్‌తేజ హాజరుకానున్నారు. పెట్రోల్ బంకులో ఉచితంగా ఎయిర్, నైట్రోజన్ సౌకర్యం కల్పించినట్లు అలాగే వినియోగదారుల కోసం క్రెడిట్, డెబిట్ కార్డులు స్వీకరిస్తున్నట్లు మేయర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చాకలి కృష్ణ

కర్నూలు: నగర శివారులోని సంతోష్ నగర్ మలుపు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి కృష్ణ (27) మృతిచెందాడు. ఈయన కల్లూరులోని రాజీవ్‌నగర్ రెండవ లైన్‌లో నివాసముంటాడు. అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్‌గా ఉంటూ కుల వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై సంతోష్‌నగర్‌కు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తూ జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని భార్య చాకలి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు సంతానం.

నేటి నుంచి వైఎస్ఆర్‌సీపీ మండల స్థాయి సమావేశాలు



రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి స్వాగతం పలుకుతున్న బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నేటి నుంచి మండల స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య తెలిపారు. మండల, గ్రామ నాయకులతో వైఎస్ఆర్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సమావేశమవుతారన్నారు. శనివారం కర్నూలు వచ్చిన రీజినల్ కోఆర్డినేటర్‌తో బీవై రామయ్య కలిసి సమావేశాల నిర్వహణపై సమీక్షించారు. 10వ తేదీన గోనెగండ్ల, 11న నందవరం, 12న ఎమ్మిగనూరు మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులతో నేరుగా రీజినల్ కోఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా నాయకులు సమావేశమై క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్తాజా ముబీనా ఖనం

కర్నూలు(సెంట్రల్): మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమని దారులుమాస్ ట్రస్టు ఇండియా చైర్మన్ ఉస్తాజా ముబీనా ఖనం అన్నారు. శనివారం రాయల్ ఫంక్షన్ హాలులో ముస్లిం మహిళ మత పెద్దల ఆధ్వర్యంలో ఇస్తేమా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రవక్త మహ్మద్ జీవిత చరిత్ర, ప్రస్తుతం జరుగుతున్న విషయాలపై ప్రసంగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రవక్త ఆదర్శ జీవితం గురించి తెలియజేసి ఆచరించేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఖురాన్ చెప్పిన నిబద్ధతను పా టించాలన్నారు. అనంతరం విద్య, ఖురాన్, నమాజ్, రోజా తదితర విషయాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

కర్నూలు(సెంట్రల్) : ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన చాకలి ఐలమ్మ, సత్తనపల్లె రామకృష్ణల ఆశయసాధన కోసం కృషి చేస్తామని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సి.గురుశేఖర్, ఎం.భాస్కరయ్య తెలిపారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో వారిద్దరి వర్ధంతి సభను ఏర్పాటు చేశారు.ముందుగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, శ్రీనివాసులు, సిరాముడు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలతో పీడించే వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): అధిక వడ్డీలతో పీడించే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. శనివారం బుధవారపేటలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి జిల్లాలో కొందరు వ్యాపారులు పేదలకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీలను వసూలు చేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల అప్పులు కట్టిన బాండ్లను వెనక్కి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇలాంటి వ్యాపారులపై పోలీసులు నిఘా వేసి అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.విజయమ్మ, ఎన్‌జీ కృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


డాక్టర్ సత్యనారాయణరావు మృతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన డాక్టర్ కొల్లపరి సత్యనారాయణరావు(80) అనారోగ్యంతో మృతి చెందారు. కర్నూలు మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించిన ఆయన సుదీర్ఘకాలం పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి కార్మికుల డాక్టర్‌గా పేరుగాంచారు. అనంతరం స్థానిక ఆర్ఆర్ హాస్పిటల్‌లో డ్యూటీ డాక్టర్‌గా ఉంటూ ఆరోగ్యశ్రీ రోగులకు వైద్యసేవలందించారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం ఓ భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాలకు చెందిన గండ్ల గంగాధర్, కుటుంబ సభ్యులు రూ.1,00,116ను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం



సన్మాన గ్రహీతలతో లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): టీచర్స్ డేను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కార్యాలయంలో పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఇందులో లా కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శివాజీరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బయోకెమిస్ట్రి అధ్యాపకులు డాక్టర్ ఇంద్రావతి, బనగానపల్లె జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు కాశి ప్రసాద్, పుల్లగుమ్మి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు జి. జోసఫ్, కర్నూలు జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు అస్లాంఅలి, శ్రీలక్ష్మి స్కూల్ సీనియర్ ఫ్యాకల్టీ రజని సంపత్ ఉన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రభాకర్ దామెర, డాక్టర్ బాలమద్దయ్య, ఎస్. నాగేశ్వరరావు, రమణగౌడ్, రామరాజ్, జయప్రకాష్, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.